

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 24వ తేదీ సోమవారం కాకినాడ జిల్లా నూతన కలెక్టర్‌గా షణ్మోహన్ బాధ్యతలు స్వీకరిస్తారని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాధ్యత స్వీకరించిన అనంతరం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను నిర్వాహిస్తారని తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కాకినాడ కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని అన్ని డివిజనల్, మండల కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్జీలను సంబంధిత అధికారుల కార్యాలయంలో అందచేయాలని జెసి సూచించారు.

విద్యుత్‌పై అదనపు బాదుడు


- హీటెక్కిస్తున్న ఎసిల వినియోగం
- కిలోవాట్‌కు రూ.1800 చొప్పున వసూలు
- వినియోగదారులపై రూ.3.10 కోట్ల భారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం మరో బాదుడుకు తెర లేపింది. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఎయిర్ కండిషనర్లు కొనుగోలు చేస్తున్న వారిని గుర్తించి అదనపు ఛార్జీ వసూలు ప్రారంభించింది. గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, కిలోవాట్‌కు రూ.1500, ఇతర ఛార్జీలు రూ.100 కలిపి రూ.1800 చొప్పున డిమాండ్ నోటీసులు జారీ చేసింది. కమర్షియల్ వినియోగదారులకు కిలోవాట్‌కు రూ.2000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 చొప్పున నోటీసులు అందజేస్తోంది. గడిచిన 3 నెలల్లో జిల్లావ్యాప్తంగా అధికారులు సర్వే చేసి 7,564 మంది వినియోగదారులు అదనపు వినియోగం చేస్తున్నారని గుర్తించారు. అక్రరాల వారందరి నిర్ణీత సమయంలో రూ.3.10 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకూ 4,576 మంది నుంచి రూ.2.23 కోట్లు వసూలు చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. వేసవి నేపథ్యంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిన విషయం విదితమే. అధికారుల గణాంకాల ప్రకారం ఫిబ్రవరిలో రోజువారీ విద్యుత్ వినియోగం సుమారుగా 18 మిలియన్ యూనిట్లు ఉండగా మార్చిలో 20 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఇటీవల రోజువారీ వినియోగం సుమారుగా 24 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. 'అదనపు' వినియోగదారులను గుర్తించి వారి నుంచి ఆదాయం పొందేలా విద్యుత్ సంస్థ కసరత్తు పూర్తి చేసింది.

'అడిషనల్' బాదుడు

విద్యుత్ సర్వీసు కనెక్షన్ తీసుకునే సమయంలో వినియోగ సామర్థ్యం ఆధారంగా డిపాజిట్ చెల్లించి కనెక్షన్ అందజేస్తారు. తర్వాత కుటుంబ అవసరాలు, ఆర్థిక స్థోమత పెరిగే కొద్దీ అదనపు పరికరాలు కొనుగోలు చేయడం పరిపాటి. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది. దీంతో విద్యుత్ సంస్థ బాదుడు మొదలవుతుంది. తొలుత కనెక్షన్ తీసుకున్న సమయంలో పేర్కొన్న కెపాసిటీకి మించి విద్యుత్ వాడడంతో కిలోవాట్‌కు అదనంగా డెవలప్‌మెంట్ ఛార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్లు, అప్లికేషన్ ఫీజు, సూపర్‌విజన్ ఛార్జీలు, ఎస్‌జిఎస్‌టి, సిజిఎస్‌టి తదితరాల పేరిట మొత్తంగా రూ.1800 వరకూ చెల్లించాల్సి వుంటుంది. ఎసి ఉపయోగిస్తే నెలకు అదనంగా రెండు కిలోవాట్ల వాడకం వుంటుంది. దీంతో కొత్తగా ఎసిలు ఉపయోగిస్తున్న వారిని అదనపు మొత్తాలు చెల్లించమంటూ విద్యుత్‌శాఖ నోటీసులు పంపుతోంది. గడువులోగా చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామన్న హెచ్చరికలు నోటీసులో ఉంటున్నాయి. సగటున మాస్తే ఎసిలు కొని నెల పాటు వాడిన వారందరికీ కనిసమంటే రూ.4 వేలు చెల్లించాలని నోటీసులు జారీ అవుతున్నాయి.



మధ్యతరగతిపై పెనుభారం

ఎసి బిగించుకుంటే అదనపు వాడకం పేరుతో బాదుడు మొదలవుతోంది. వేసవి నేపథ్యంలో వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఉక్కపోతతో సతమతం అవుతుండడంతో అత్యధికంగా మధ్య తరగతి కుటుంబాలు నెలసరి వాయిదాలపై ఎసిలు కొనుగోలు చేస్తున్నారు. వేసవిలో ఎండలు మండిపోతుండడం, ఉక్కపోత, ఫ్యానుగాలి మరింత వేడిని పంచడం వంటి కారణాలతో ఈ వేడిని తట్టుకోలేని ఎసిలు కొనుగోలు చేస్తున్నామని కొనుగోలుదారులు చెబుతున్నారు. ఇప్పుడి జిల్లాలో పదుల సంఖ్యలో ఏజెన్సీలు, రిటైల్ దుకాణాలు 50 వరకూ ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని ఓ ప్రముఖ ఏజెన్సీలోనే గత నెలలో 600 ఎసిలు, ఈ నెలలో 500 ఎసిలు అమ్ముడయ్యాయి. ఎసి వినియోగంతో నెలవారీ కరెంటు బిల్లులు పెరుగుతాయి. అయిదు వందలు దాటని బిల్లులు చెల్లించేవారు కూడా నెలకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు చెల్లించక తప్పడం లేదు. వేసవిలో మూడు నెలల పాటు తప్పనిసరై ఈ అదనపు భారాన్ని భరించేందుకు సిద్ధపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేస్తూ అడిషనల్ పేరుతో షాక్ ఇస్తున్నారు.



యాసలపు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, ఇతర నాయకులు

సూర్యారావు జీవితం ఆదర్శప్రాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

కష్ట జీవుల కోసం నిరంతరం కృషి చేసిన ప్రజా నాయకుడు యాసలపు సూర్యారావు జీవితం ఆదర్శప్రాయంగా నిలుస్తుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జోష్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభ, కవితా గోష్ఠిలో ఆమె మాట్లాడుతూ ప్రజా నాయకుడిగా, ప్రజా కవిగా, ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త ప్రజా ఉద్యమాలను ఉధృతంగా నిర్మించాలన్నారు. సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జి మాట్లాడుతూ పెద్దాపురం మండలానికి మాత్రమే ఆయన పరిమితం కాకుండా జిల్లా వ్యాప్తంగా జరిగిన అనేక ప్రజా ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారని తెలిపారు జోషుల కృష్ణబాబు మాట్లాడుతూ ప్రజలకు అర్థమయ్యే రీతిలో కథలు, పాటలు, కవితలు రాసి ప్రజా కవిగా మంచి గుర్తింపు పొందారన్నారు. సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ మాట్లాడుతూ ఆయన రచనలన్నీ ప్రజలను ఆలోచింప చేసాయన్నారు. సాహితీ గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, జెవివి నాయకులు బి అనంతరావు, యుటిఎఫ్ నాయకులు సూరిబాబు, పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయన ప్రజా ఉద్యమాలకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక ఉద్యమాలలో కూడా తన వంతు పాత్ర నిర్వహించారన్నారు. ఈ సభలో ప్రజానాట్యమండలి కళాకారులు కేదారి నాగు, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాత్ర రాంబాబు బృందం యాసలపు సూర్యారావు రచించిన గీతాలను ఆలపించారు. ఈ సభా కార్యక్రమానికి ముందు యాసలపు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కొత్త శివ, మంజుల, చల్లా విశ్వనాథం, అజయ్ కుమార్, కాపుగంటి కోటి, చల్లా దుర్గాప్రసాద్ తదితరులు కవితా గానం చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ, అప్పన్న, గడిగట్ల సత్తిబాబు, దాడి బేబీ పాల్గొన్నారు.

'ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయండి'

ప్రజాశక్తి - అన్నవరం, తొండంగి

వివిధ గ్రామాల్లో ప్రభలుతున్న డయేరియా నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోనూ వైద్యారోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదేశించారు. ఆదివారం మండలంలోని డయేరియా బాధిత గ్రామాలైన కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో ఆమె పర్యటించారు. కొమ్మనాపల్లిలో వైద్యారోగ్యశాఖ అధికారులు,, పిహెచ్‌సి వైద్యాధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎవి.నగరం పిహెచ్‌సి వైద్యాధికారి పి.రవికుమార్ మొత్తంగా 86 కేసులు నమోదు కాగా 33 మందికి గ్రామంలోనే వైద్యం అందించామని, మిగిలిన వారందరిని మెరుగైన వైద్యం కోసం తుని ఏరియా ఆస్పత్రి, కాకినాడ జీజీహెచ్‌లకు రిఫర్ చేశామని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుని, పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. ఇంటింటా సర్వేను నిర్వహించి నివేదికలను పంపించాలని ఆదేశించారు. నిల్వ మాంసం, చేపల విక్రయాలను నిషేధించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయి అధికారులకు నివేదించాలన్నారు. ఈ పర్యటనలో వైద్యారోగ్యశాఖ రిజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మశశిధర్, డిఎంఅండ్‌హెచ్‌ఒ నరసింహనాయక్, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌ఒ సరిత, వైద్యులు రవికుమార్, భారతి, కె.రవి, కె. అర్చన పాల్గొన్నారు.



తొండంగిలో వైద్యాధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

మరో ఐదుగురికి అతిసార

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం శివారు ప్రాంతం జొన్నలదొడ్డిలో ఆదివారం మరో ఐదుగురికి అతిసార వ్యాధి సోకింది. వారిలో ఇద్దరు నాలుగేళ్లలోపు చిన్నారులు కావడంతో వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ వై.హిమావతి, డాక్టర్ ఎస్.పార్దేశ్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే జొన్నలదొడ్డి ప్రాంతాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి సందర్శించారు. మండల పరిధిలోని వేట్లపాలెం, మాధవపట్నం, పనసపాడు, వికె.రాయపురం, బోయినపూడి తదితర గ్రామాల్లో ఎంపిడిఒ శ్యాంసుందర్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



డయేరియా బాధితురాలితో మాట్లాడుతున్న పద్మావతి

తూరంగి ముంపును నివారించండి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తూరంగి గ్రామ పంచాయతీలో ముంపు సమస్యను నివారించాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం కురిసిన వర్షానికి తూరంగిలో జలమయం అయిన ప్రాంతాలను పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జోగా అప్పారావు నాయకత్వంలో పలువురు పర్యటించారు. ఈ సందర్భంగా పౌర సంక్షేమ సంఘం నాయకులు సిహెచ్.అజేయ్‌కుమార్ మాట్లాడుతూ వర్షపు నీటితో జయప్రకాష్ నగర్, జడ్‌పి స్కూల్ ఆవరణ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో వర్షపు నీరు ముందుకు వెళ్లక పోవడంతో ఆ ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయని అన్నారు. ముంపు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించక పోవడం దారుణ మన్నారు. గోపికృష్ణ కాలనీ మీదుగా నిర్మించిన కాలువ నీరు ప్రవహించకుండా పంచాయితీ అధికారులు అడ్డుకట్ట వేయడం క్షమించరాణి దన్నారు. ఈ ప్రాంతంలో పెద్ద తూరను కానీ, కల్వర్ట్‌ను గానీ తక్షణం నిర్మించాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు కాళ్ళ గోపి, మేడిశెట్టి నాని మాట్లాడుతూ గోపికృష్ణ కాలనీ కాలువ నిర్మాణ పనులు, రివిటింగ్ పనులు కాలువ చివరి వరకూ పూర్తిచేయకపోవడం వల్ల ఇబ్బంది కల్గుతుందన్నారు.కాలువ పక్కగా వెళ్ళే హై ఓల్టేజ్ కరెంటు స్తంభాలు రెండు నెలల కితం కూలిపోయాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యలు పరిస్కరించాలని, ఎంఎల్ఎ పంతం నానాజీ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సంఘం ప్రతినిధులు

చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంపు

- త్వరలో వైసిపి ఎంఎల్‌ఎలు జంప్
- కార్మిక శాఖ మంత్రి సుభాష్ వెల్లడి

ప్రజాశక్తి - కాకినాడ

ఇంట్లో కుటుంబ పెద్ద చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉపయోగపడే చంద్రన్న బీమా సొమ్మును రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళికలను రచిస్తోందని కార్మికులతోపాటు, పాత్రికేయులు, న్యాయవాదులను కూడా ఈ బీమాలోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. గత వైసిపి అరాచక ప్రభుత్వంలో చంద్రన్న బీమా పేరు మార్చడమే కాకుండా ఎంతోమందికి పరిహారం అందించకుండా కాలయాపన చేసిందన్నారు. రూ.3 లక్షలుగా ఉన్న బీమా సొమ్మును రూ.10 లక్షలకు పెంచి వారిలో ఆత్మ స్థైరాన్ని నింపుతున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వం కార్మిక శాఖకు చెందిన సొమ్మును దుర్వినియోగం చేసిందని, అందుకే కార్మికులు జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రజలు వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని, అయితే ఆ పార్టీ తరుపున గెలిచిన ఎంఎల్ఎలు వేరే పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని, త్వరలోనే ఆ పార్టీ ఖాళీ అవుతుందని అన్నారు. అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియా వ్యాధితో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. తొలుత ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద మంత్రి సుభాష్ పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పలువురు కలిసి ఆయనకు పుష్పాగుచ్చాలిచ్చి అభినందించారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు పప్పు దుర్గారమేష్, పెంకే శ్రీనివాస్‌బాబా, సుందరపల్లి గోపాలకృష్ణ, అనుసూరి సతీష్, గణేష్, కార్మిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్నమంత్రి సుభాష్

డయేరియాపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి, తాళ్లరేవు

గండేపల్లి మండలంలో డయెరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ హనుమంతరావు సూచించారు. ఆదివారం మండలంలోని సింగరంపాలెం, రామయ్యపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. తాగునీటిలో క్లోరినేషన్ పరిమానంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బిఎస్ఎన్.మూర్తి, ఎఎన్ఎం సుబ్బలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నవరాజు, ఆశ కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలంలోని అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పలు ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. ఆదివారం తాళ్ళరేవు మండలంలోని లచ్చిపాలెం, ఉప్పంగల గ్రామాల్లో ఎంపిడిఒ బృందం పర్యటించింది. పలు గృహాల్లోని తాగునీరు నాణ్యతలను తనిఖీలు చేశారు. అతిసార కేసులుగా గుర్తిస్తే వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్లు 7207118051, 7093930574ను సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ పర్యటనలో ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి, ఎఇ ఇ.మారుతీరావు, సర్పంచ్ శాఖ శంకరుడు, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ జాస్తి వసంతకు సత్కారం

ప్రజాశక్తి - గండేపల్లి

మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంతను గ్రామ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ విజయానికి వసంత చేసిన కృషిని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి బుల్లియ, గద్దె అబ్బన్న, సుంకవల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భీమేశ్వరుని అభిషేకాలకు అనుమతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 24 నుంచి భీమేశ్వరుని రోగలింగానికి అభిషేకాల నిర్వహణకు అనుమతి లభించడం జరిగిందని ఇఒ బల్ల నీలకంఠం తెలిపారు. శివలింగం జీర్ణోదరణ మరమ్మతులు కారణంగా దేవాలయంలో ఆర్కియాలజీ పనుల కారణంగా సుమారు నెల రోజుల నుంచి స్వామి మూల విరాట్ అభిషేకాలను నిలిపివేశారు. ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ సూచనల మేరకు ఈనెల 24 నుంచి యథావిధిగా అభిషేకాలు నిర్వహిస్తామని, భక్తులు గమనించాలని ఇఒ తెలిపారు.

నేడు హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో హుండీలను ఈ నెల 24వ తేదీన లెక్కిస్తారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామమోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమించిన అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరుపుతారన్నారు.

కథల పోటీలో శ్రీనివాస్‌కు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కంచిపాటి గురుమూర్తి స్మారక కథల పోటీలో పెద్దాపురం పట్టణానికి చెందిన ఎన్‌బిఎస్.శ్రీనివాస్ పోలిశెట్టి రాసిన 'ఆ చూపులకు నజరానా ఆ కనులకు జరిమానా' కథకు ప్రథమ బహుమతి లభించింది. విశాఖ జిల్లా ఆగనంపూడిలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో సినీ, టివి నటులు ప్రసన్నకుమార్ చేతుల మీదుగా శ్రీనివాస్ బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోషుల కృష్ణబాబు,పెద్దాపురం కార్యదర్శి కొత్త శివ, గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్, ప్రజానాట్యమండలి నాయకులు దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణ, మహపాతిన రాంబాబు అభినందించారు.



విజేత శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు రన్ దోహదం


ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఒలింపిక్ రన్ దోహదం చేస్తుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక మెహర్ కాంప్లెక్స్ వద్ద ఒలింపిక్ రన్‌ను వార్డ్ కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు క్రీడలు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి వ్యాయామ ఉపాధ్యాయులు నిమ్మకాయల కిరణ్, స్వాతి, ఉపాధ్యాయులు ఎఎల్‌వి.కుమారి, కె.శ్రీనివాస్, ఇ.వీరబాబు, కొట్ని నాగేశ్వరరావు, బ్రహ్మన్న మాస్టర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

కార్టూ'నిజం'



వరుస చోరీలు.. ప్రజల బెంబేలు...

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వరస చోరీలతో మండలంలో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉప్పాడ రింగ్ రోడ్డు సమీపానికి అతి దగ్గరలో 7 రోజుల క్రితం పాలు ఇతర వ్యాపారం చేసే ఒక షాపులో రూ.60 వేలు చోరీకి గురియైంది. ఆ సంఘటన జరిగి మరువక ముందే ఆదివారం తెల్లవారు జామున మరో 2 చోరీలు చోటుచేసుకున్నాయి. అమీనాబాద్ సెంటర్‌లో శ్రీ దత్త కిరాణా షాపులో షాపుపైన ఉన్న రేకు కోసి దుకాణంలోకి గుర్తు తెలియని వ్యక్తి చొరపడ్డాడు. షాపులో సిసి కెమెరాని తొలగించి రూ.36 వేల నగుదను ఎత్తికుపోయాడు. ఈ మేరకు దుకాణ యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే రోజు తెల్లవారుజామున కొత్తపల్లి సెంటర్ సమీపంలో ఉన్న ఒక పాన్ షాపులో సిమెంటు రేకు బద్దలు కొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చొరపడ్డారు. సిగరెట్లు,.వివిధ ఖరీదైన వస్తువులు, నగదు దొంగలించారు. అయితే ఈ పాన్ షాప్ వ్యక్తి ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదు. ఇదిలా ఉండగా ఆ షాపు పక్కనే ఉన్న భవన్ నిర్మాణ కార్మికుడికి చెందిన ఒక షాపులోకి చొరపడ్డారు. షాపు తాళాలు, పక్కనే ఉన్న రేకులు తొలగించి. షాపులోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ఈ షాపులో ఎటువంటి చోరీ జరగకపోవడంతో ఈ యాజమాని కూడా ఫిర్యాదు చేయలేదు. జరిగిన నాలుగు చోరీల్లో రెండు చోరీలకు సంబంధించి ఫిర్యాదు చేశారు. జరిగిన వరస చోరీలతో మండలంలో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రిపూట పోలీసుల గస్తీ లేకపోవడం వల్లే దొంగలు రెచ్చిపోతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



సిసి పుటేజ్‌లో చిక్కిన చోరీకి పాల్పడుతున్న దుండగుడు

మొక్కు తీర్చుకున్న టిడిపి ఎస్‌సి నేతలు



గౌరీపట్నంలో మొక్కు తీర్చుకున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కిర్లంపూడి

జగ్గంపేట ఎంఎల్ఎగా జ్యోతుల నెహ్రూ అఖండ విజయం సాధించడంతో జగ్గంపేట నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు గుడాల రాంబాబు ఆధ్వర్యంలో పలువురు గౌరీపట్నంలో మొక్కు తీర్చుకున్నారు. కిర్లంపూడి గ్రామం నుంచి సాదే యేసుబాబు, కట్టు నానిబాబు, బంగారాజు, తదితరులు గౌరీపట్నంలో మొక్కు తీర్చుకుని తిరుగు ప్రయాణంలో జగ్గంపేట చేరుకున్నారు. జగ్గంపేటలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మా అభిమాన నాయకుడు జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగా గెలుపొందితే గౌరీపట్నం వచ్చి మొక్కులు తీర్చుకుంటామని ఆదివారం ఆ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చుక్కా సుబ్బారావు, మూరా రాఘవ, సాదే డేవిడ్ రాజు, గుద్దాటి డేవిడ్‌రాజ్, మూరా చిరంజీవి, బంగారు దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

జూలై 13, 14 తేదీల్లో కర్నూలులో జిల్లా క్రీడా సాధికారిక సంస్థ ఈత కొలనులో నిర్వహించే రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో పాల్గొనే జిల్లా ఈత క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఆదివారం స్థానిక రామారావుపేటలోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో బాల, బాలికలకు నిర్వహించిన ఈ ఎంపిక పోటీలో గ్రూప్- 1లో ఎ.ధనుంజయ్, వి.మణికంఠ నవీన్, కె.సుజన్‌రెడ్డి, కెఎం.ముఖేష్, వి.మణికంఠ మనోహర్, ఎ.షణ్ముఖశ్రీసాయి, గ్రూప్-2లో ఎ.అబిశాయి, బి.కౌశిక్‌వర్ధన్, ఆర్ఎస్.జాన్, బి.ఆహిల్, కె.విరాజ్, టివిసి.సాయిసాకేత్, ఆర్.మనోహం శ్రీసాయి, ఎస్ఎం.అర్జున్, ఎస్‌కె.హుస్సేన్, సిహెచ్.హిమధ్యత్, పి.దక్షిత, డి.కమల వైష్ణవి, కె.తనుశ్రీ, కె.సోనుప్రియ ఎంపిక య్యారు. అలాగే గ్రూప్ - 3లో కె.దర్శిల్, ఎస్.క్రితిక్, ఎం.సాయిచరణ్, ఎం.షణ్ముఖ వీర్, ఎల్.హేమవర్షిత్, ఎం.హర్ష, ఆర్ఎస్ ఎస్ఎస్.ధనుష్, ఎం .పల్లవి, కె.శ్యామల, టి.తేజస్వి, జయశ్రీ, ఎం.యశస్విని, పి.తన్వి ఎంపికయ్యారు. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్షులు పెదిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుమళ్ల రాజు, ముఖ్య సలహాదారు మంగి శివరామకృష్ణ, స్విమ్మింగ్ కోచ్‌లు అప్పలనాయుడు, ఉదయ్, అజయ్ కుమార్, వీరభద్రరావు, హరి, రవి, తేజ, నాని, వీరబాబు, జాన్ పాల్గొన్నారు.



ఎంపిక పోటీలో క్రీడాకారులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ప్రజాశక్తితో డిఇఒ పిల్లి రమేష్



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి



ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన, నాణ్యమైన విద్య అందుతుందని, పలు స్కూళ్లలో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ అన్నారు. స్టూడెంట్ కిట్స్ పంపిణీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో రోజురోజుకూ భరోసా పెరుగుతుందన్నారు. ఫీజుల భారం భరించలేక జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు సర్కారు బడుల్లో చేరుతున్నారన్నారు. ఇంకా పలు అంశాలను ఆయన ప్రజాశక్తితో పంచుకున్నారు.

రెండో విడత నాడు-నేడు పనులు ఎంతవరకు వచ్చాయి..?

జిల్లాలో రెండో దశలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులతో సమూల మార్పులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడానికి నాడు-నేడు ఎంతగానో తోడ్పడుతుంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నాం. రూ.133.27 కోట్లతో రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 881 పాఠశాలల్లో పనులు చేయాలని ప్రతిపాదించి మొదలు పెట్టారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. త్వరలోనే మిగిలిన పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఏయే వసతులు కల్పిస్తున్నారు.?

పిల్లలకు అవసరమైన వసతులన్నీ సమకూరుస్తున్నాం. మరుగుదొడ్లు, ప్రహరీలు, ఆట వస్తువులు, సైకిల్ షెడ్లు, తాగునీరు, బెంచీలు, గ్రీన్ బోర్డులు, ఫ్లోరింగ్ టైల్స్, మొక్కలు, ప్రతి పాఠశాలకు స్మార్ట్ టీవీ సమకూరుస్తున్నాం. భవిష్యత్తులో పిల్లలు బాధ్యతగా మెలిగేందుకు వారిని భాగస్వామ్యం చేసేలా కమిటీలు వేస్తాం. ఉపాధ్యాయుల కమిటీలను కూడా త్వరలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

జిల్లాలో స్టూడెంట్ కిట్స్ ఎన్ని వచ్చాయి. ఇంకా ఎన్ని రావాల్సి ఉంది.?

జిల్లాకు 12,34,513 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు 10,12,333 (82 శాతం) పుస్తకాలు వచ్చాయి. ఇంకా 2,22,180 పుస్తకాలు రావాల్సి ఉంది. అవసరమైన నోటు పుస్తకాలు అన్నీ చేరుకున్నాయి. 1,38,065 జతలు యూనిఫామ్ అవసరం కాగా 24,183 (17.52 శాతం) రాగా ఇంకా 1,13,882 జతలు రావాల్సి ఉంది. 1,38,056 బ్యాగ్స్ అవసరం కాగా ఇప్పటి వరకూ 17,492(12.67 శాతం) వచ్చాయి. ఇంకా 1,20,573 బ్యాగులు రావాల్సి ఉంది. 90,796 బెల్ట్‌లు రావాల్సి ఉండగా 75,572 (83.23శాతం) వచ్చాయి. ఇంకా 15,224 రావాల్సి ఉంది. అలాగే షూలు 1,38,065 అవసరం కాగా ఇప్పటి వరకు 1,37,627 (99.68 శాతం) వచ్చాయి. ఇంకా 438 షూలు రావాల్సి ఉంది. ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలు పూర్తిస్థాయిలో రావాల్సి ఉంది. వచ్చిన వాటిని ఇప్పటికే ఆయా మండలాల్లో పాఠశాలలకు తరలించడంతో బాటు విద్యార్థులకు పంపిణీ కూడా చేశాం.

స్టూడెంట్ కిట్లలో ఏవేవి ఉంటాయి.?

మరో వారం,పది రోజుల్లోనే స్టూడెంట్ కిట్స్ పంపిణీ పంపిణీ పూర్తి చేస్తాం. ఈ కిట్లలో మూడు జతల యూనిఫామ్స్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్ వంటివి ఉంటాయి. బాలురకు స్కై బ్లూ రంగు, బాలికలకు నేవీ బ్లూ రంగు బ్యాగులు అందించాము.

పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వస్తున్నాయి. వీటిని ఎలా సరిదిద్దుతారు.?

అధికారులు విధిగా పాఠశాలలకు వెళ్లి పర్యవేక్షించాల్సిందే.అక్కడ లోటుపాట్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలి. జాబ్ చార్టు ప్రకారం పాఠశాలలు తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదించాలి. ఇప్పటికే జిల్లా, ఉప, మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు తప్పక పర్యవేక్షించాలని ఆదేశించాం. నిర్లక్ష్యం చేసిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటాం.

నో స్కూల్ బ్యాగ్ డే ఎలా అమలవుతుంది.?

ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వారంలో ఒక రోజు అయినా చిన్నారులకు పుస్తకాలు మోసే బరువును తగ్గించాలని ప్రభుత్వం భావించింది. అందుకే నో స్కూల్ బ్యాగ్ డే విధానంలో భాగంగా నెలలో మొదటి, మూడు శనివారాల్లో స్కూల్‌కు చిన్నారులు బ్యాగ్ లేకుండా వెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించి అన్ని విద్యాసంస్థలకు ఆదేశాలను కూడా జారీ చేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖ జిల్లా భీమునిపట్నం ప్రాంతంలోని తగరపువలస గ్రామానికి చెందిన దుర్గాసి చిన్ని యానం వైపు నుంచి కాకినాడ వస్తూ డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆ యువకుడుని సమీప ఆసుపత్రికి హైవే పోలీసులు తరలించారు.

జన జాతర సభ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈడిముడి గ్రామంలో జూలై 7న తలపెట్టిన మాదిగ జన జాతర సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కాల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భీమవరం పేటలో మాదిగ జన జాతరకు చెందిన కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఆర్‌సిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వల్లూరి నాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల పోరాటంలో జరిగిన ఆటుపోట్లు సమీక్షించుకుని చిరకాల స్వప్నమైన వర్గీకరణ సాధనకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నందిక చక్రం, నాయకులు వేలంగి సత్తిబాబు, సూర్యారావు, చెన్నా రాజు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పట్ల హర్షం

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

గత ప్రభుత్వం విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరు తొలగించి, జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చిన నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ ఆ పథకానికి అంబేద్కర్ విదేశీ విద్యగా మార్చడం అభినందనీయమని ఎంఆర్‌పిఎస్ నాయకుడు, న్యాయవాది బొల్లిపో సునీల్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై అనేకసార్లు దళిత సంఘాలన్నీ మొర పెట్టుకున్నప్పటికీ అంబేద్కర్ పేరు పెట్టడంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అంబేద్కర్ పేరును కొనసాగించాలని జిఒ విడుదల చేయడం పట్ల సునీల్ రాజ్ హర్షం వ్యక్తం చేశారు.

వర్షాకాలంలో పోషకాహారం తప్పనిసరి

కాకినాడ రూరల్ : వర్షాకాలంలో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని, కాబట్టి పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పోషకాహార నిపుణులు పి.పార్థసారథి సూచించారు. ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో దాహం వేయక పోయినా మంచినీళ్లు తాగాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విటమిన్ సి ఎక్కువగా ఉండే తాజా పండ్లను తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవకుల కృషి అభినందనీయం

కాకినాడ రూరల్ : దేశాభివృద్ధికి ప్రభుత్వ సేవకులు అందిస్తున్న సేవలు అభినందనీయమని న్యాయవాది పెండెం శ్రీదేవి కొనియాడారు. ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసేవ దినోత్సవంలోఆమె మాట్లాడారు. సమాజానికి 2002 నుంచి జూన్ 23న ప్రపంచ పబ్లిక్ సర్వీస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కొంతమంది ప్రభుత్వ శాఖల ద్వారా సేవ చేస్తుంటే మరి కొంతమంది స్వచ్ఛందంగా సామాన్య ప్రజలకు సేవ చేస్తున్నారని శ్రీదేవి తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

సీజనల్ వ్యాధులు పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి అన్నారు. ఆదివారం మండలంలోని పులిమేరు గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి మంచినీటి సరఫరా విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పులను బట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పారిశుధ్యం పట్ల, పరిసరాల పరిశుభ్రత పట్ల, స్వచ్ఛమైన తాగునీటి పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏరోజు చెత్త పోగులను ఆ రోజే తొలగించాలని, డ్రెయిన్లను ప్రతిరోజు శుభ్రం చేయించాలని, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ ఇంజనీరింగ్ అధికారి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు, దాతలు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీ అడబాల ట్రస్ట్ కార్యాలయంలో విశ్రాంతి తహశీల్దార్ రేలంగి బాపిరాజు సౌజన్యంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పాలన సంక్షేమ అధికారి సిహెచ్.వెంకటరావు మాట్లాడుతూ సంపాదనతోపాటు పదిమందికి సహాయపడటంలోనే ఆనందం ఉంటుందన్నారు. దీనిని జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. సాయం చేసే గుణం ప్రతి ఒక్కరిలో పెరగాలని అన్నారు. బాపిరాజు సేవా గుణాన్ని వెంకటరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఫోటో స్టూడియోలో చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీ బాలాజీ ఫోటో స్టూడియోలో ఆదివారం తెల్లవారుజామున దుండగులు ప్రవేశించి ఖరీదైన కెమెరాలు, నగదు దొంగిలించినట్లు యజమాని సత్యవరపు దుర్గారావు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం షాపు తెరిచి చూడగా విలువైన కెమెరాలు, రూ 10 వేలు నగదు దొంగిలించినట్లుగా గుర్తించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.